
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



రేణుకాఎల్లమ్మ గుడికి భూమిపూజ

అచ్చంపేట: ప్రభుత్వం కేటాయించిన స్థలంలో గౌడ కుల దేవత రేణుకా ఎల్లమ్మతల్లి, కంఠ మహేశ్వరస్వామి గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకరరావు గురువారం భూమిపూజ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 522.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



భక్తిశ్రద్ధలతో కోటిదీపోత్సవం

మచిలీపట్నంటౌన్: బందరు రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి గుడిలో గురువారం కోటి దీపోత్సవం జరిగింది. 35 అడుగుల శివుడి విగ్రహం వద్ద దీపాలను వెలిగించారు.

న్యూస్‌రీల్

రెండు చోట్ల ఉన్న ఓట్లను తొలగించండి

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



గుంటూరు వెస్ట్ : ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో ఓట్లు వేసిన కొందరికి మన జిల్లాలో, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గురువారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో డొక్కా మాట్లాడుతూ రెండు చోట్ల ఉండటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. దీని వల్ల అక్రమాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఆత్తోట జోసఫ్, అంగడి శ్రీనివాస్, షేక్ మస్తాన్‌వలి, మాదా రాధాకృష్ణమూర్తి, పాల్గొన్నారు.

10 నుంచి ఆల్ ఇండియా క్యారమ్స్ టోర్నమెంట్

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : ఆల్ ఇండియా క్యారమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర క్యారమ్స్ సంఘం నిర్వహణలో ఈ నెల 10 నుంచి 13 వరకు విశాఖలో 28వ ఆల్ ఇండియా ఫెడరేషన్ కప్ క్యారమ్స్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని పోటీల నిర్వహణ కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26 రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొంటాయన్నారు. మొత్తం రూ.25 లక్షల వ్యయంతో భారీ స్థాయిలో ఏపీ రాష్ట్ర క్యారమ్స్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ నీరజ్ కుమార్ సంపతి నేతృత్వంలో నిర్వహిస్తామన్నారు. జిల్లా నుంచి పి.శ్రీనివాసరావు, షేక్ ఎండి సాదిక్, సిహెచ్ సుధలు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ప్రత్యేక అలంకారంలో నరేంద్రస్వామి



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో కార్తిక మాసం బహుళ దశి పురస్కరించుకుని గురువారం స్వామి వారికి 25వ రోజు ప్రాతఃకాలంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే స్వామి వారికి ద్వాదశ హారతులు కొనసాగుతున్నాయి. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ చైర్మన్ జంపని అంజయ్య, కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు.

మూడు రోజుల వ్యవధిలో 3,966 మిల్లీమీటర్ల వర్షం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో ఎక్కడా వర్షం పడలేదని వాతావరణశాఖ అధికారులు గురువారం వెల్లడించారు. మిచాంగ్ తుఫాన్ వల్ల నాలుగో తేదీ నుంచి ఆరో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. ఆ మూడురోజుల వ్యవధిలో జిల్లాలోని 28 మండలాల్లో 3,966.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సగటున ప్రతి మండలంలో 141.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. 5న 1,252.4 మి.మీ. వర్షం పడగా 6న 2,713.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. మూడురోజుల వ్యవధిలో చిలకలూరిపేటలో అత్యధికంగా 249.6 మి.మీ. వర్షం పడగా, సత్తెనపల్లిలో 232.0, నరసరావుపేటలో 219.8 మి.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా రెంటచింతలలో 51.4 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది.

యార్డుకు 27,945 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 27,945 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 26,950 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.21,300 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 24,000 వరకు లభించింది.

ఆగమేఘాలపై ఆపద్బాంధవుడు

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన

- బాధితులకు కొండంత భరోసా
- మధ్యాహ్నం 1.05 గంటలకు బాపట్లకు రాక
- కర్లపాలెం మండలం పాతనందాయపాలెంలో మిర్చి, బుద్దాంలో వరి పంట పరిశీలన
- రెండు ప్రాంతాల్లోనూ రైతులతో ముఖాముఖి
- మధ్యాహ్నం 3:35 గంటలకు తిరిగి తాడేపల్లికి పయనం
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక సందర్భంగా ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యే కోన రఘుపతి

సాక్షి ప్రతినిధి,బాపట్ల/బాపట్ల/కర్లపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం బాపట్ల జిల్లాలో పర్యటించనున్నారు. మిచాంగ్ తుఫాన్ మంగళవారం బాపట్ల సమీపంలోని సూర్యలంకలో తీరం దాటడంతో జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. కోతదశలో ఉన్న వేలాది ఎకరాల వరి పంట నీటమునిగింది. మిర్చి, పొగాకు, శనగ, మినుము పంటలతోపాటు అరటి, ఇతర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. పర్చూరు ప్రాంతంలోని సాగునీటి ప్రధాన కాలువలు, వాగులకు గండ్లు పడ్డాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. దీంతో పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. ముఖ్యమంత్రి ముందస్తు సూచనలతో అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం సకాలంలో స్పందించడంతో నష్ట తీవ్రత తగ్గింది. బాధితులను అన్ని రకాలుగా ఆదుకోవాలన్న సీఎం ఆదేశాలతో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయం అందించింది. ఈ నేపథ్యంలో సీఎం శుక్రవారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. బాధితులకు భరోసా ఇవ్వనున్నారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఈ నేపథ్యంలో కలెక్టర్ రంజిత్‌బాషా గురువారం తన చాంబర్‌లో సీఎం పర్యటనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం హెలిప్యాడ్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరుకుంటారని కలెక్టర్ వివరించారు. హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసే పంట నష్టాల ఫొటో ప్రదర్శనను పరిశీలిస్తారని వెల్లడించారు. అనంతరం కర్లపాలెం మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తారని వివరించారు. పాతనందాయపాలెం వద్ద మిర్చి, బుద్దాం వద్ద వరి పంటలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. అక్కడ పంటలు నష్టపోయిన రైతులతో ముఖాముఖి మాట్లాడతారని పేర్కొన్నారు. హెలిప్యాడ్, బారికేడ్ పనులు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈని కలెక్టర్ ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద, ముఖ్యమంత్రి పర్యటన జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, డీఆర్వో పి.వెంకట రమణ, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, డీఆర్డీఏ పీడీ అర్జున్‌రావు, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డీఎస్‌ఓ విల్సన్, డీఎం శ్రీలక్ష్మి, డీపీఓ రాంబాబు పాల్గొన్నారు.

పాతనందాయపాలెం, బుద్దాం వద్ద ఏర్పాట్ల పరిశీలన

సీఎం పర్యటన నేపథ్యంలో పాతనందాయపాలెం, బుద్దాం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే కోన రఘుపతి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇదిలా ఉంటే కర్లపాలెం మండలంలో వరిని 6,820 హెక్టార్లలో సాగు చేయగా 4,796 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మిర్చి 197 ఎకరాలలో సాగు చేయగా 186 ఎకరాల్లో పంట నీటమునిగిందని, మినుము 182 ఎకరాలలో సాగు చేయగా 180 ఎకరాలు, వేరుశనగ 14 ఎకరాలలో సాగు చేయగా పూర్తిగా తుఫాన్ ధాటికి దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక నివేదికలు రూపొందించారు.

ట్రాఫిక్ మళ్లింపు

సీఎం పర్యటన నేపథ్యంలో బాపట్ల జిల్లాలో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

- రేపల్లె, చెరుకుపల్లి వైపు నుంచి బాపట్లకు వచ్చే వాహనాలను యాజలి-గుడిపూడి మీదుగా బాపట్ల - పొన్నూరు మార్గంలోకి మళ్లించనున్నారు.
- బాపట్ల నుంచి రేపల్లె, చెరుకుపల్లి వైపు వెళ్లే వాహనాలు గుడిపూడి-యాజలి మీదుగా వెళ్లనున్నాయి.
- బాపట్లలోని హీరో మోటార్ సైకిల్ షోరూమ్ జంక్షన్ నుంచి బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ దగ్గరలో ఉన్న జంక్షన్ వరకు హైవేపైకి వాహనాలకు అనుమతి లేదు.
- చీరాల వైపు నుంచి సూర్యలంకకు వచ్చే వాహనాలు బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ దగ్గరలో ఉన్న జంక్షన్ నుంచి బాపట్ల టౌన్‌లోకి వచ్చి గడియార స్తంభం సెంటర్ మీదుగా సూర్యలంకకు వెళ్లాలి.
- సూర్యలంక వైపు నుంచి వచ్చే వాహనాలకు హైవేపైకి అనుమతి లేదు. బాపట్ల టౌన్ లోని గడియార స్తంభం సెంటర్ నుంచి చీరాల (లేదా) గుంటూరు వైపునకు వెళ్లేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

కట్టుదిట్ట బందోబస్తు

సీఎం పర్యటన సందర్భంగా కట్టుదిట్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాలో 1,150 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని వెల్లడించారు. గురువారం అధికారులకు రూట్‌మ్యాప్ గురించి వివరించారు. మొత్తం నలుగురు డీఎస్పీలు, 17మంది సీఐలు, 54 మంది ఎస్సైలతోపాటు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారని వెల్లడించారు. సిబ్బంది తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు టి.వెంకటేశ్వర్లు, ఎస్. ప్రసాద్‌రావు, టి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీఎం పర్యటన రూట్‌మ్యాప్‌ను వివరిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

రైతులకు అండగా ఉండే ప్రభుత్వం ఇది

తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన బాపట్ల ప్రాంతానికి నేనున్నానంటూ బాసటగా నిలిచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తుండడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో 96 వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. రైతులతో మాట్లాడి, వారి కష్టాలు తెలుసుకుని ధైర్యం నింపేందుకు సీఎం వస్తున్నారని వెల్లడించారు. ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని కోన స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని దిగ్విజయంగా అమలు చేస్తోందని గుర్తుచేశారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగేదిలా..

శుక్రవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి తిరుపతి పర్యటన ముగించుకొని 1.05 గంటలకు హెలికాప్టర్‌లో బాపట్ల పరిధిలోని మరుప్రోలువారిపాలెం 216 జాతీయ రహదారి వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద దిగుతారు. 1.15 గంటల వరకు స్థానిక నేతలతో మాట్లాడతారు. ఆ తరువాత 1.40 గంటల వరకు అక్కడ పంట నష్టాలపై ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను, స్టాళ్లను పరిశీలిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 1.50 గంటలకు కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామానికి చేరుకుంటారు. 2.35 గంటల వరకు అక్కడ నీటమునిగిన మిర్చి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడతారు. 3.10 గంటలకు సమీపంలోని బుద్దాం గ్రామానికి వెళ్లి అక్కడ దెబ్బతిన్న వరి పంటను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడతారు. 3.15 గంటలకు తిరిగి రోడ్డు మార్గాన బయలుదేరి 3.30 గంటలకు మరుప్రోలువారిపాలెం 216 జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 3.35 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నాలుగు గంటలకు తాడేపల్లికి చేరుకుంటారు.

సంక్షేమ 'ఆటో'గ్రాఫ్

ఉన్నతి-మహిళాశక్తి పథకం ద్వారా 9 మందికి ఆటోలు



ఆటో లబ్ధిదారుకు తాళం చెవి, పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల అర్బన్: స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ప్రగతికి బాటలు వేసుకునే వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. పొదుపు సంఘాల సభ్యులైన ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వం ఉన్నతి-మహిళా శక్తి పేరిట ఆటోలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టిందని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 660 మందికి ఆటోలు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా మొదటి విడతలో బాపట్ల జిల్లాలో తొమ్మిది మంది అర్హత సాధించారు. వీరికి గురువారం ఎమ్మెల్యే కోన రఘుపతి, కలెక్టర్ రంజిత్ బాషా ఆధ్వర్యంలో ఆటోలు పంపిణీ చేశారు. డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.అర్జున్ రావు ప్రైవేటు వడ్డీల బారిన పడకుండా ప్రభుత్వం ముందస్తుగా రుణం అందించడం గొప్ప విషయమని చెప్పారు.

వరదతో ది'గాలు'

- కృష్ణానదిలో గాలుమార్గం కోత
- బాపట్ల, కృష్ణా జిల్లాల మధ్య నిలిచిన రాకపోకలు



కోతకు గురైన గాలు మార్గం

కొల్లూరు : కృష్ణా నదికి వరద నీరు విడుదల చేయడంతో గాలు మార్గం కోతకు గురై బాపట్ల, కృష్ణా జిల్లాల మధ్య వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు వస్తున్న వరద నీటిని అధికారులు మంగళవారం దిగువకు సముద్రంలోకి వదిలారు. బుధవారం నీటి విడుదలను మరింత పెంచి 18 వేల క్యూసెక్కుల వరకు దిగువకు వదిలారు. దీంతో కొల్లూరు మండలంలోని కృష్ణానదిలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఖరీఫ్‌సాగు తుది దశకు చేరుకోవడంతోపాటు, తుఫాన్ నేపథ్యంలో కాల్వల ద్వారా నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం లేకపోవడంతో నది ద్వారా సముద్రంలోకి వదులుతున్నారు. కృష్ణానదికి వరద నీరు భారీగా వచ్చి చేరడంతో బాపట్ల జిల్లా గాజుల్లంక- కృష్ణా జిల్లా శ్రీకాకుళం మధ్య రైతులు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన గాలు మార్గం కోతకు గురైంది. ఫలితంగా రాకపోకలు నిలిచిపోయాయి. రైతాంగం ఇబ్బందులు పడుతోంది. ఇప్పటివరకు ఇరు జిల్లాల రైతులు గాలు మార్గం ద్వారా రెండు కిలోమీటర్లు ప్రయాణిస్తే సరిపోయేది. ఇప్పుడు ఆ మార్గం అందుబాటులో లేకపోవడంతో పెనుమూడి-పులిగడ్డ వారధి మీదుగా 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ప్రజలు పడవల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు.

బాధిత కుటుంబాలకు ఆపన్నహస్తం



రేపల్లె మండలం కైతేపల్లిలో..



పెనుమూడిలో..



బొబ్బర్లంకలో..

మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో రేపల్లె మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన బాధితులకు ప్రభుత్వం అందించిన నగదు, నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమాలను గురువారం ఆయా సచివాలయ కేంద్రాలలో నిర్వహించారు. కైతేపల్లి గ్రామంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, పెనుమూడి గ్రామంలో సర్పంచ్ దారం విజయ్, చోడాయపాలెం పంచాయతీ బొబ్బర్లంక గ్రామంలో సర్పంచ్ మాతంగి రవి, సెక్రటరీ శ్రీను బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదు పంపిణీ చేశారు.

– రేపల్లె రూరల్

క్లుప్తంగా

పూరిల్లు కూలి వృద్ధురాలు మృతి





మృతి చెందిన కర్రా అన్నపూర్ణమ్మ

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం తూర్పు దళిత వాడకు చెందిన కర్రా అన్నపూర్ణమ్మ(65) గురువారం మృతి చెందింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి గోడలు నానిపోయి ఆ గుడిసెలో నిద్రిస్తున్న అన్నపూర్ణమ్మపై పడటంతో మృతి చెందింది. మృతురాలికి ఇరువురు కుమారులు ఉన్నారు. తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు ఆదేశానుసారం వీఆర్వో రత్నాకర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వర్సిటీ ఫుట్‌బాల్ విన్నర్ పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల ఫుట్‌బాల్ పోటీలలో పీఎన్‌సీ అండ్ కేఆర్ డిగ్రీ కళాశాల జట్టు ప్రథమ స్థానం సాధించటంతో పాటు నలుగురు క్రీడాకారులు వర్సిటీ జట్టులో స్థానం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ జి.వి.రావు, వ్యాయామ అధ్యాపకుడు పి.వెంకటేష్ గురువారం తెలిపారు. వర్సిటీ క్రీడా మైదానంలో ఈనెల 1,2 తేదీలలో నిర్వహించిన పోటీలో తమ జట్టు ప్రథమ స్థానం సాధించటంతో పాటు జట్టులోని పి.విజయసాయి, జె.సుధాకర్, కె.రావికిరణ్, కె.జీవన్‌కుమార్ వర్సిటీ జట్టులో స్థానం సాధించారని వివరించారు. క్రీడాకారులను కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రేమ్‌చంద్, జాయింట్ సెక్రటరీ పి.శ్రీనివాసప్రసాద్, కోశాధికారి డాక్టర్ ఎం.అన్నపూర్ణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి అభినందించారు.



కొల్లూరు మండలం అనంతవరం వద్ద వర్షపు నీటి మధ్య ఉన్న ధాన్యపు రాశిని ఒడ్డుకు మోస్తున్న మహిళలు



కొల్లూరు సమీపంలోని ఈడ్గా వద్ద తడవకుండా జాగ్రత్త చేసిన ధాన్యాన్ని బస్తాలకు ఎత్తుతున్న రైతులు



కొల్లూరు మండలం చిలుమూరులో నీటితో నిండిన పంట పొలాల్లోని ధాన్యపు బస్తాలను ఎడ్ల బండ్లపై తరలించుకుంటున్న రైతులు

సహాయక చర్యలు ముమ్మరం

మిచాంగ్ తుపాను అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. బుధవారం కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. అధికారుల లెక్కల ప్రకారం మండలంలో 9,773 ఎకరాలలో వరి సాగు చేపట్టారు. తుపాను ప్రారంభానికి ముందే రైతులు 20 శాతం పంట కోతలు పూర్తిచేసి ధాన్యం అమ్మకాలు చేశారు. మిచాంగ్ తుపాను 7,337 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటపై ప్రభావం చూపింది. ఇందులో సుమారు 5 వేల ఎకరాల పంట వరకు నేలమట్టం అయ్యింది. ఈ నేపథ్యంలో నష్టాన్ని కొంత మేర తగ్గించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్‌లోని వర్షపు నీరు పారుదల జరిగేలా పొక్లెయిన్‌తో పూడికతీత పనులు చేపడుతున్నారు. దీనికి తోడు ఆర్‌బీకే సిబ్బంది, ఉపాధి హామీ పథకం కూలీలు పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు తరలించే పనుల్లో నిమగ్నం చేశారు. తుపాను కారణంగా పడిపోయిన వరి పంటను కాపాడుకోవడం, టార్పాలిన్ పట్టాలు కప్పి కాపాడుకున్న ధాన్యాన్ని వర్షపు నీటి మధ్య నుంచి సురక్షితంగా ఒడ్డుకు చేర్చుకునే పనిలో రైతులు సైతం తలమునకలవుతున్నారు. చెమ్మగిల్లిన ఒడ్లను ఆరబెట్టుకోవడంతోపాటు, ఎడ్ల బండ్ల సాయంతో పొలాల నడుమ ఉన్న ధాన్యపు బస్తాలను బయటకు తరలించుకుంటున్నారు. లంక గ్రామాలలో సాగులో ఉన్న 850 ఎకరాల విస్తీర్ణంలోని మినుము, అరటి, పసుపు పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

– కొల్లూరు

రైతుకు అండగా జగనన్న ప్రభుత్వం

- బాధితులకు 25 కేజీల బియ్యం, రూ.1000 పంపిణీ
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానందరెడ్డి



కేశవరప్పాడు వద్ద పొగాకు పంటను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానందరెడ్డి

కారంచేడు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన అన్నదాతలకు జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందని సహకార, మార్కెటింగ్ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యర్రంవారిపాలెం, కేశవరప్పాడు, కొడవలివారిపాలెం, తిమిడెదపాడు గ్రామాల్లో నష్టపోయిన పంటలను ఆయన గురువారం పరిశీలించారు. గ్రామంలో వరద ఉధృతికి ఇళ్లల్లోకి నీరు వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆయన పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆయన ఆ కుటుంబాలకు తక్షణ నష్టపరిహారంగా 25 కేజీల బియ్యంతోపాటు, రూ.1000 నగదు పంపిణీ చేశారు. అనంతరం కేశవరప్పాడు–తిమిడెదపాడు గ్రామాల మధ్యన ఉన్న అలుగు వాగుపై ఉన్న నేల చప్టా పూర్తిగా కొట్టుకుపోవడంతో రెండు గ్రామాల మధ్యన రాకపోకలు నిలచిపోయాయని గ్రామ సర్పంచ్ కొడాలి మోహన్‌కృష్ణ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే యుద్ధప్రాతిపదికన పనులు చేయించేలా సంబంధిత అధికారులతో మాట్లాడతామన్నారు. కొడవలివారిపాలెం సమీపంలో ఉన్న నీట మునిగిన మిరప, పొగాకు చేలల్లో ఆయన దిగి నీటిలో ఉరకెత్తుతున్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆయన వారిని ఓదార్చి జగనన్న ఇప్పటికే ఒక్కో జిల్లాకు తక్షణ సహాయంగా రూ.2 కోట్లు ఇచ్చారన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది పంట నష్టాలను అంచనా వేస్తారన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందిస్తారన్నారు. శుక్రవారం సీఎం జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా బాపట్ల జిల్లాలో పర్యటించనున్నారన్నారు. గతంలో మాదిరిగా కాకుండా నేటి ప్రభుత్వ పాలనలో నష్టపరిహారం వెంటనే అందిస్తామన్నారు. బాపట్ల జిల్లాలో ప్రధానంగా వరి, మిరప, పొగాకు, మొక్కజొన్న పంటలు నేలమట్టమయ్యాయన్నారు. మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు, ఎంపీడీవో పీ లక్ష్మీనారాయణ, గోగినేని బుల్లెబ్బాయి పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

నరసరావుపేట: నరసరావుపేటలో గురువారం విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టణంలోని పలు మెడికల్ షాపులను తనిఖీ చేశారు. బిల్లులు ఇవ్వకుండా, ఫార్మాసిస్ట్ లేకుండా నాణ్యత లేని నాసిరకం మందులు అమ్ముతున్నారనే విశ్వసనీయమైన ముందస్తు సమాచారంపై రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో అధికారులు రెండు టీములుగా స్థానిక డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సునీతతో వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మల్లమ్మసెంటర్‌లోని గోపాలకృష్ణ మెడికల్స్, వెంకటకృష్ణ మెడికల్స్, వెంకట మురళి మెడికల్ స్టోర్‌లలో తనిఖీ చేసి పలు లోపాలను గుర్తించారు. మూడు షాపులలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా, అమ్మకపు బిల్లులు లేకుండా మెడిసిన్ విక్రయిస్తున్నారు. షెడ్యూలు రిజిస్టర్ నిర్వహించుట లేదని గుర్తించారు. మూడు షాపుల నుంచి శాంపిల్స్ సేకరించి విజయవాడ డ్రగ్ కంట్రోల్ లేబొరేటరీకి పంపించారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టరు ఎ.శ్రీహరిరావు, ఎస్.శ్రీనివాసులురెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.శివనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుంది

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



కుళ్లిపోయిన మిర్చి తోటలను పరిశీలిస్తున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని కనగాల, గూడవల్లి, పొన్నపల్లి, తుమ్మలపాలెం, రాంబొట్లపాలెం గ్రామాల్లో మోపిదేవి గురువారం పర్యటించి ముంపునకు గురైన వరి పొలాలను, పచ్చి మిర్చి తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. తుమ్మలపాలెం, రాంబొట్లపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న పచ్చిమిర్చి తోటలను అంచనా వేయాలని అధికారులకు సూచించారు. మోపిదేవి మాట్లాడుతూ పొలాల్లో నిలిచిన నీటిని డ్రెయిన్లు, కాలువల ద్వారా బయటకు పంపించేందుకు వ్యవసాయశాఖ, డ్రెయినేజీ, ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారులు, నాయకులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు మరివాడ వెంకటపావని, పార్టీ మండల కన్వీనర్ సైనం ఏడుకొండలరెడ్డి, మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, చీరాల ప్రసాదరెడ్డి, కామినేని కోటేశ్వరరావు, తహసీల్దార్ కె.వెంకటేశ్వర్లు, ఏఓ బాలాజీ గంగాధర్, వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు ఆర్థికసాయం

405 కుటుంబాలకు రూ.10,12,500లక్షల పంపిణీ



బాధితులకు నగదు అందజేస్తున్న తహసీల్దార్ కేశవనారాయణరావు

కర్లపాలెం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులతోపాటు ఆర్థికసాయం అందజేసినట్లు తహసీల్దార్ కేశవనారాయణరావు తెలిపారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందిన వారికి ఉదయం అల్పాహారంతోపాటు రెండు పూటలా భోజనం పెట్టారు. తిరిగి తమ ఇళ్లకు వెళుతున్నప్పుడు ఒక్కొక్క కుటుంబానికి రూ.2,500 నగదు, 25కేజీల బియ్యం, కందిపప్పు కేజీ, శనగ నూనె కేజీ, ఉల్లిపాయలు కేజీ, బంగాళదుంపలు కిలో చొప్పున అధికారులు పంపిణీ చేశారు. కర్లపాలెం మండల పరిధిలో పూరిగుడిసెలలో నివాసం ఉంటున్న నక్రావారిపాలెంలో 24కుటుంబాలు, పేరలిలో 21 కుటుంబాలు, గణపవరంలో 60 కుటుంబాలు, కర్లపాలెంలో 73 కుటుంబాలు, చింతాయపాలెంలో 19 కుటుంబాలు, పెదగొల్లపాలెంలో 43 కుటుంబాలు, దుండివారిపాలెంలో 165 కుటుంబాల వారిని పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చామని తెలిపారు. మొత్తం 405 కుటుంబాలలోని 988 మందికి పునరావాస కేంద్రాలలో ఆశ్రయం కల్పించామని తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి నగదు, నిత్యావసర సరుకులు అందజేసినట్లు తెలిపారు.

భోజన వసతులు బాగున్నాయి



మా వలంటీర్, సర్పంచ్ వచ్చి తుఫాన్ వస్తుంది. గుడిసెలో ఉండకూడదు అధికారులు తీసుకు రమ్మంటున్నారని చెప్పి మా వాళ్లందరినీ యాజలి బడికి తీసుకువెళ్లారు. అక్కడ మాకు టిఫిన్‌తోపాటు రెండు పూటలా అన్నం పెట్టారు. అక్కడే డాక్టర్లు ఉండి అవసరమైన వారికి మందులు ఇచ్చారు.

–వెంకాయమ్మ దుండివారిపాలెం

డబ్బులు, సరుకులు ఇచ్చారు



తుఫాన్ వస్తే గుడిసెలు ఎగిరిపోతాయని ముందుగానే మా అందరినీ యాజలి సెంటర్‌లోని బడికి తీసుకువెళ్లారు. అక్కడ అందరికీ మంచి భోజనం పెట్టారు. మేము తిరిగి మా ఇళ్లకు వచ్చేటప్పుడు రూ.2,500 నగదు, బియ్యం, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాళదుంపలు ఇచ్చి పంపారు.

–రామారావు, దుండివారిపాలెం

వరద ఉధృతికి కొట్టుకుపోయిన వృద్ధుడు మృతి

కాపాడే ప్రయత్నం చేసిన పోలీసులు

కారంచేడు: దాయాదుల ఇంటిలో జరుగుతున్న ఒక కార్యక్రమానికి వస్తున్న వ్యక్తి మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వరదల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన గురువారం ఉదయం కారంచేడు–స్వర్ణ గ్రామాల మధ్యన ఉన్న నేల చప్టా వద్ద జరిగింది. కారంచేడు ఎస్సై శ్రీనివాసరావు వివరాల మేరకు.. రెండు రోజుల నుంచి మొండి కాలువ తెగడంతో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. రెవెన్యూ, పోలీసు సిబ్బంది అక్కడ ఔట్‌పోస్ట్ కూడా ఏర్పాటు చేశారు. కంపలు అడ్డుపెట్టి అటువైపు ప్రయాణాలు సాగకుండా ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం కారంచేడు గ్రామానికి చెందిన దగ్గుబాటి విజయ్‌కిషోర్ (60) ఇంకొల్లులో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పనులపై గ్రామానికి వస్తుండగా వరద ఉధృతిని ఊహించని కిషోర్ నీటిలో నుంచి ద్విచక్రవాహనంపై దాటేందుకు ప్రయత్నించాడు. గమనించిన పోలీసు సిబ్బంది కేకలు వేసినా అతను గమనించుకోలేదు. వరద ఉధృతికి బైకు పక్కనే ఉన్న కొమ్మమూరు కాలువ వైపునకు వెళ్లింది. ఈ ప్రవాహంలో అతడు కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న కానిస్టేబుల్‌తోపాటు, స్థానికులు వెంటనే నీటిలో పడిన వ్యక్తిని కాపాడే ప్రయత్నం చేసినా అతడు కాలువలోకి కొట్టుకుపోయాడన్నారు. స్థానికుల సాయంతో వెతకగా అచేతనంగా పడి ఉన్న వ్యక్తిని బయటకు తీశారు. కానీ అప్పటికే అతను మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేద్దాం

న్యాయమూర్తి బాలాజీ పిలుపు



మాట్లాడుతున్న ఆరో అదనపు జిల్లా కోర్టు జడ్జి కె.పి.బాలాజీ

బాపట్ల: ఈనెల 9వ తేదీ శనివారం జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేద్దామని 6వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.పి.బాలాజీ పిలుపునిచ్చారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా గురువారం కోర్టు ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి కె.పి.బాలాజీ మాట్లాడారు. క్రిమినల్ కేసులపై ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులతో మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎక్కువ మొత్తంలో పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ , న్యాయవాదులు నందనవనం ప్రసాదరావు, కంచర్ల అవినాష్, ఎస్. రవీంద్ర బాబు, సి.హెచ్. ప్రేమ్‌చంద్, సి.హెచ్.ఆంజనేయులు, కె.రవి, తటవర్తి రామకృష్ణ, సి.హెచ్.రాజు, కొననా వీరశేఖరరావు, వుసా క్రిష్ణ, మాధురి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకే వర్సిటీ స్విమ్మింగ్ జట్టు ఎంపిక



జేఎన్‌టీయూకే వర్సిటీ స్విమ్మింగ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో వర్సిటీ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఈత అత్యుత్తమ వ్యాయామమని జేఎన్‌టీయూ–ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల ఆధ్వర్యంలో గురువారం సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషులు, మహిళల స్విమ్మింగ్ పోటీలు, వర్సిటీ స్విమ్మింగ్ జట్ల ఎంపిక నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని 5 జిల్లాలోని కళాశాలల నుంచి స్విమ్మర్లు పోటీలో పాల్గొన్నారు. పోటీలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్యం నుంచి ఈత నేర్చుకోవటం ద్వారా వరదల సమయంలో ప్రాణాప్రాయం నుంచి రక్షణ పొందటంతో పాటు ఇతరులకు సహాయపడవచ్చని తెలిపారు. కాగా, వర్సిటీ జట్టుకు పురుషుల విభాగంలో పి.సుజన్‌చౌదరి, పి.ఎస్.జి.ప్రణవ్‌రాహుల్, పీవీపీ సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల (కానూరు), జి.శశివర్ధన్, వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల (కానూరు), పి.ధనుష్, ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ), స్టాండ్‌బైగా వి.దీపక్‌అజయ్, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల(సూరంపాలెం), ఆర్.గిరిష్‌కుమార్, వీఆర్ సిద్దార్థ కళాశాల (కానూరు), మహిళా జట్టుకు ఎస్.కీర్తన, సీహెచ్.మానిక, ఎం.దేవిదుర్గాసుధేష్ణ, వీఆర్ సిద్దార్థ కళాశాల (కానూరు), కె.మోక్షిత ఎస్.వి.ఇంజినీరింగ్ కళాశాల (భీమవరం) ఎంపికయ్యారు. జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా ఎస్‌ఆర్‌సీ కళాశాల పీడీ ఎల్.కృష్ణారెడ్డి, డీఎస్ఏ స్టేడియం స్విమ్మింగ్ కోచ్ జి.సురేష్, పరిశీలకుడిగా జేఎన్‌టీయూ –ఎన్ ఇంజినీరింగ్ కళాశాల వ్యాయామ సంచాలకులు డాక్టర్ జి.పి.రాజు వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

మరొకరికి గాయాలు



మృతి చెందిన నరసింహారావు

అద్దంకి రూరల్: లారీ బైకును ఢీకొట్టడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ ఘటన అద్దంకి పట్టణంలో గురువారం కలవకూరు జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని పెరికపాలేనికి చెందిన కుంచాల నరసింహారావు (70), రోశయ్యలు బైకు మీద అద్దంకి–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై వెళ్తుండగా కలవకూరు జంక్షన్ వద్దకు రాగానే వెనుకగా వస్తున్న లారీ వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. దీంతో నరసింహారావు కాలుపై నుంచి లారీ వెళ్లటంతో నుజ్జు నుజ్జయి తీవ్ర రక్తస్రావమైంది. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో ఇరువురిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్ర రక్తస్రావమైన నరసింహారావు మృతి చెందారు. గాయాలైన రోశయ్యను ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలను తెలుసుకుని లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

గ్యాస్ లోడుతో వెళుతున్న వాహనం దగ్ధం

తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో దగ్ధమైన వాహనం

భట్టిప్రోలు: గ్యాస్ లోడుతో వెళుతున్న వాహనం నుంచి గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే స్థానిక సాయి జ్యోతి ఇండేన్ గ్యాస్ కంపెనీ నుంచి సిలిండర్‌లు డెలివరీ ఇచ్చేందుకు వాహనంలో డ్రైవర్ శ్రీకాంత్, డెలివరీ బాయ్ ఐలవరం బయలుదేరారు. భట్టిప్రోలు–ఐలవరం మధ్యకు వచ్చేసరికి వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్, డెలివరీ బాయ్ వాహనంలోని 20 గ్యాస్ బండలను బయటకు లాగేశారు. పెను ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలాన్ని గ్యాస్ కంపెనీ నిర్వాహకులు యడ్ల సునీల్, సిబ్బంది పరిశీలించారు. ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. వాహనంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడడం వల్లే ప్రమాదం సంభవించినట్లు కంపెనీ నిర్వాహకులు తెలిపారు.

ముంపు ప్రాంత పంటల పరిశీలన



మార్టూరు: తుఫాన్ తీవ్రతకు మండలంలో దెబ్బతిన్న పంటలను రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్ గురువారం పరిశీలించారు. నాగరాజుపల్లి గ్రామంలో పడిపోయిన అరటి, మిరప పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి పెట్టుబడి, ఇతర ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి హనుమంతనాయక్, కిరణ్‌కుమార్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు చంద్రబాబు పర్యటన

తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన

సాక్షి ప్రతినిధి, బాపట్ల : ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు శుక్రవారం బాపట్ల జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తారు. ఉదయం తెనాలి పర్యటన అనంతరం 11.45 గంటలకు బాపట్ల జిల్లా అమర్తలూరు గ్రామానికి చేరుకుంటారు. 12.30 గంటల వరకు తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తారు. అమర్తలూరులో రైతులతో మాట్లాడతారు. 2.15 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి 2.45 గంటలకు నగరం మండలంలో ఉత్తరపాలెం చేరుకుంటారు. 3.30 గంటల వరకు అక్కడ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తారు. 4.15 గంటలకు కర్లపాలెం మండలం కొత్త నందాయపాలెం గ్రామానికి చేరుకుంటారు. 5 గంటల వరకు తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తారు. 5.30 గంటలకు బాపట్లలోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. శనివారం పర్యటన షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉంది.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను అమృతలూరు ఐసీడీఎస్ అధికారిణి విజయలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. శాతానువారి వీధి, ఐలవరం ఎస్సీ, ఎస్టీ వాడల్లోని 6 కేంద్రాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అలాగే ప్రీ స్కూల్ విద్యార్థులతో ముచ్చటించారు. పాటలు, కథలు అడిగి తెలుసుకున్నారు. అలాగే చిన్నారులకు అక్షరాలతో పాటు కథలలో ఉన్న రంగులను కూడా గుర్తించే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. ఆమె వెంట అంగన్‌వాడీ కార్యకర్తలు డి.రత్నకుమారి, శివనాగలక్ష్మి ఉన్నారు.

10న పద్మశాలీయ కార్తిక వన సమారాధన

భట్టిప్రోలు: మార్కండేయ పద్మశాలీయ బహుత్తమ సేవా సంఘం భట్టిప్రోలు–అద్దేపల్లి ఆధ్వర్యంలో ఈ నెల 10న స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కొతరపు పిచ్చయ్యశాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్తిక మాసం ప్రత్యేక పూజలు



బాపట్ల అర్బన్ : ఎస్ఎస్‌పీ అగ్రహారంలోని గంగాపర్వతవర్ధని సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తిక మాసం గురువారం ప్రాతఃకాల విశేష ద్రవ్య అభిషేకం నిర్వహించారు. 'గురు దక్షిణామూర్తి'గా రామలింగేశ్వర స్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు గూడూరు చిట్టిబాబు, పంగులూరి కౌండిన్య, నెమలికంటి హనుమంతరావు, ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, గురు దక్షిణామూర్తి స్తోత్రం, లింగాష్టకం పఠించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కొల్లిపర వెంకటశివ వరప్రసాద్ స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



భట్టిప్రోలు: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామి వార్లకు లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. దేవస్థాన వంశపారంపర్య ట్రస్టీ కొడాలి శంకరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. రాదాబత్తుని వంశీయులు పాల్గొన్నారు. భజన బృందంతో స్వామి అత్తవారి ఇల్లు అయిన అద్దేపల్లి అమ్మవారి చెట్టు నుంచి మేళతాళాలతో దేవాలయానికి చేరుకున్నారు. పూజా కార్యక్రమాల్లో దంపతులు పాల్గొన్నారు. కొతరపు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ఫౌండర్ ట్రస్టీలు పర్యవేక్షించారు.

అన్ని విధాలుగా అండ

- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు
- ప్రభుత్వ ఆర్థిక సాయం, నిత్యావసరాల పంపిణీ
- దిగువ ప్రాంతాల్లో నీటి పారుదలకు చర్యలు
- కాలువల్లో వేగంగా పూడిక తీత పనులు
- దగ్గరుండి పర్యవేక్షిస్తున్న ప్రజా ప్రతినిధులు



పేటేరు మురుగు కాల్వలో పూడిక తీత

చెరుకుపల్లి: తుపాను కారణంగా పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు అన్నారు. గుళ్లపల్లి గ్రామం పునరావాస కేంద్రంలో ఉన్న 14 కుటుంబాలకు రూ.24,500 ఆర్థిక సాయాన్ని కోటేశ్వరరావు గురువారం అందజేశారు. ఇందులో ఒంటరిగా ఉన్నవారికి రూ.వెయ్యి, ఇద్దరుంటే రూ.2వేలు, ఎక్కువ మంది ఉంటే రూ.2.500 వంతు ఆర్థిక సాయం అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కె.రమేష్, వలంటీర్లు నిర్వాసితులు పాల్గొన్నారు.

నిజాంపట్నం: తుపాను ప్రభావిత గ్రామాల ప్రజలను సకాలంలో ఆదుకుని రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని సర్పంచ్ కొంతి శ్రీనివాసరావు అన్నారు. అడవులదీవి ఎస్టీ కాలనీలో తుపాను ప్రభావంతో సర్వం కోల్పోయిన కుటుంబాలకు గురువారం ఆర్థిక సాయం, బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఆధ్వర్యంలో ఒక్కో ఎస్టీ కుటుంబానికి రూ.2500ల నగదు, 25 కేజీల బియ్యం, వంట నూనె, కందిపప్పు, ఉల్లిపాయలు, కూరగాయలు వంటి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రైతుబాబు, పరమేశ్వరరావు, సాంబశివరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, అమ్మయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

రేపల్లె: మిచాంగ్ తుపాను నేపథ్యంలో ప్రజాప్రతినిధులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. మేజర్ పంచాయతీ దళిత వాడలోని ఎస్సీ కాలనీలో వర్షపు నీరు నిలవటంతో గ్రామ సర్పంచ్ కనపర్తి వసుమతి, పంచాయతీ అధికారులు ప్రొక్లెయినర్‌తో కాల్వలు తీయించారు. రావిఅనంతవరం రహదారి, ఓలేరు రహదారిలో పూడిపోయిన మురుగు కాల్వల్లో గుర్రపుడెక్క, తూటి కాడలను తొలగించారు. దీంతో నీరుపారుదల సులభమైంది.

నగరం: తుపాను బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. తుపాను ప్రభావంతో ఉపాధి కోల్పోయిన ఎస్టీ కుటుంబాలకు గురువారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తుపాను కారణంగా ఉపాధి కోల్పోయిన ఎస్టీ కుటుంబాలను గుర్తించి, వారికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలోని 249 ఎస్టీ కుటుంబాలకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, పామాయిల్, కందిపప్పు, బంగాళాదుంపలు, ఉల్లిపాయల అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎం.ప్రమీల, సర్పంచ్‌లు చింతల పవన్‌కుమార్, చింతల సుబ్బారావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య, తహసీల్దారు



అడవులదీవి ఎస్టీ కాలనీలో పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు



ప్రభుత్వ ఆర్థిక సాయం అందజేస్తున్న కోటేశ్వరరావు

కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులపై నివేదిక ఇవ్వాలి

జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి



కాంట్రాక్టర్లతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదిక ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ ఛాంబర్‌లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం తుఫాన్ కారణంగా నగరంలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చని కార్పొరేటర్లకు సూచించారు. ఇప్పటివరకు వార్డుల వారీగా కార్పొరేటర్లు అందించిన అర్జీలు, వాటి పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు కూడా కమిషనర్‌తో చర్చించడానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా సమయం కేటాయించడం జరిగిందన్నారు. మిగిలిన రోజుల్లో కార్పొరేటర్లకు అందుబాటులో ఉంటామని, వాట్సాప్‌లో సమస్యలు తెలిపినా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనలను క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలియజేయాలని ఆదేశించారు.

నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి..

నగరంలో టెండర్ పొందిన కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం కమిషనర్ ఛాంబర్ లో నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు నిర్వహించే కాంట్రాక్టర్ల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తెచ్చారని, వాటిని నిర్దేశిత గడువులో పరిష్కారం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు వర్క్ అగ్రిమెంట్ పొందిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసినప్పుడే నగర అభివృద్ధి జరుగుతుందని, కాంట్రాక్టర్లు తాము పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లుల ఆన్‌లైన్ చేయడం, చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యలను ప్రతి శుక్రవారం జరిగే స్పెషల్ గ్రీవెన్స్‌లో తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. కాంట్రాక్టర్లు అందించిన అర్జీలను, ఫిర్యాదులను ప్రత్యేకంగా నమోదు చేయాలని, వారి సమస్యలు పరిష్కారం అయ్యాక తెలియచేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా అన్ని స్టేజిల్లో వేగంగా రికార్డ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. కాంట్రాక్టర్లు తాము చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.

కార్మికులకుల కుటుంబాలకు అండగా ఉంటాం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ఇంజినీరింగ్ విభాగం కార్మికురాలు వి.విజయకుమారి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్‌ను గురువారం కమిషనర్ చాంబర్‌లో ఆమె భర్తకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో గాంధీ పార్క్‌లో విధులు నిర్వహించే టి.విజయకుమారి ఇటీవల కాలంలో మరణించారని ఆమె భర్త రమణారావుకు నగరపాలక సంస్థ నుంచి ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షలు, మట్టి ఖర్చులు రూ.15 వేలకు సంబంధించిన చెక్‌ని అందించామన్నారు. అదే విధంగా నగరపాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్లను ఆదేశించారు.

నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు..

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో మిచాంగ్ తుఫాన్ అనంతరం అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం తుఫాన్ అనంతరం నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనుల నిర్వహణపై డిప్యూటీ కమిషనర్, ఎంహెచ్ఓ, శానిటరీ సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాన్ వలన వర్షం నీరు నిల్చిన ప్రాంతాల్లో బెయిల్ అవుట్ చేశాక ప్రజారోగ్య సిబ్బంది తప్పనిసరిగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, అందులో భాగంగా బ్లీచింగ్ చల్లడం, రోడ్ల మీద పేరుకున్న సిల్ట్ తొలగించడం, కల్వర్ట్‌ల వద్ద నిలిచిన అడ్డంకులను తొలగించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ రవీంద్ర, ఎంహెచ్ఓ (ఎఫ్ఏసీ) మధుసూదన్, ఎస్ఎస్‌లు ఆనందకుమార్, అయుబ్ ఖాన్, సోమ శేఖర్ పాల్గొన్నారు.

బెటాలియన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



మంగళగిరి: నగర పరిధిలోని ఆరో బెటాలియన్ ఆవరణలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి క్రిస్మస్ స్టార్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్లు హనుమంతు, మల్లికార్జునరావు, దాసు, ప్రభాకరరావు, శ్రీనివాసరావు, క్రిస్మస్ కమిటీ సభ్యులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధిత మహిళ సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసింది. వివరాల్లోకి వెళితే శ్యామలానగర్ 1వలైనుకు చెందిన సుజాత అనే మహిళ గృహంలో వారం రోజుల క్రితం ఐదున్నర సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఇంట్లో అందరూ ఉన్న సమయంలోనే నగలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన పోలీసులు గురువారం చోరీ ఘటనపై కేసు నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ నరేంద్రబాబు తెలిపారు

వెండితెర వెన్నెల సంతకం సావిత్రి

లక్ష్మీపురం: మహానటి సావిత్రి అంటే వెండి తెర మీద వెన్నెల సంతకమని సినీరంగ విశ్లేషకుడు అవధానుల అమరాచారి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సావిత్రి జయంతి వేడుకల్లో భాగంగా ముందుగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానటి సావిత్రి తెలుగు తెరపై ప్రకాశించి మన మధ్యలేకున్నా నేటికీ వెలుగులు చిమ్ముతున్నారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు, రచయిత కె.జయకుమార్, విశ్రాంత ఇంజినీర్ ఘనశ్యామాచార్యులు తదితరులు నివాళులర్పించి ప్రసంగించారు.

పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న ధరణి

రేపల్లె: ఆపదలో ఉన్నవారిని ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ అన్నారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో పట్టణంలోని 19, 20 వార్డుల నిరుపేదలు 300 మందికి షారోనా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాట్లాడుతూ షారోనా వెల్ఫేర్ సొసైటీ తీర ప్రాంతంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫౌండర్ రెవ్వర్ ధరణి, మాజీ కౌన్సిలర్‌లు అజయ్, పెనుమూడి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దిక్సూచిగా ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్



యూటీఎఫ్ నాయకులతో కలిసి ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అధిక మార్కుల సాధన దిశగా యూటీఎఫ్ ముద్రించిన ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్ ప్రయోజనం చేకూర్చుతాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం యూటీఎఫ్ రూపొందించిన ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ మోడల్ పేపర్స్ ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. మోడల్ పేపర్స్ బుక్‌లెట్‌లో ముందుమాటను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ రాశారని తెలిపారు. విద్యార్థులు పరీక్షల్లో అధిక మార్కులను సాధించేందుకు వీలుగా వ్యాపార ధోరణితో కాకుండా నామమాత్రపు ధరకే పుస్తకాన్ని అందించడం అభినందనీయమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల ప్యాట్రన్‌లోనే టెన్త్ సబ్జెక్టుల బోధనలో రాష్ట్రస్థాయిలో నిపుణులైన ఉపాధ్యాయులతో మోడల్ పేపర్లను రూపొందించామని, ప్రతి యేటా అత్యుత్తమ మోడల్ పేపర్లను అందించడంలో యూటీఎఫ్‌కు గుర్తింపు ఉందని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మాట్లాడుతూ విద్యార్థులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘ జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, కోశాధికారి ఎండీ దౌలా, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, కేదార్‌నాథ్, ఆడిట్ కమిటీ సభ్యులు కోటిరెడ్డి, ప్రభుజీ, ప్రేమ్‌కుమార్, టి.వినోద, అంకమ్మరావు, యశోధర పాల్గొన్నారు.

'ఉపాధి హామీ ప్రభావం'పై పరిశోధనకు డాక్టరేట్



డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న ఏడుకొండలు

తెనాలి : 'అణగారిన సమూహాలపై మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రభావం. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఒక అధ్యయనం'పై సమర్పించిన పరిశోధన వ్యాసానికి దాసరి ఏడుకొండలుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య త్రిమూర్తిరావు చేతులమీదుగా ఏడుకొండలు గురువారం డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. ఆయన స్వగ్రామం నగరం మండల గ్రామం బెల్లంవారిపాలెం. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఏడుకొండలు చదువు సుదీర్ఘంగా సాగింది. జీవనం కోసం రకరకాల పనుల్లో గడిపారు. సోషల్ సైన్స్‌లో పీజీ చేశారు. స్నేహితుల ప్రోత్సాహంతో స్టేట్ ఎలిజిబిలిటీ (సెట్) పరీక్ష పాసయ్యారు. ఆచార్య త్రిమూర్తిరావు పర్యవేక్షణలో జరిపిన పరిశోధనా వ్యాసానికి పీహెచ్‌డీ సాధించటం విశేషం. నిరుపేదలు అయినప్పటికీ తల్లిదండ్రులు తనను బడికి పంపించటం గొప్ప విషయమని ఏడుకొండలు అన్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా చదువును కొనసాగిస్తూ రావటమే తన విజయానికి కారణం అన్నారు.

కులగణనపై పెదవి విప్పని ప్రతిపక్షాలు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన

మంగళగిరి: పార్లమెంట్ లోపల ప్రతిపక్షాలు మాట్లాడడం లేదని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు విమర్శించారు. గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలగి సామాజిక న్యాయం జరగాలంటే ఓబీసీ కులగణన తప్పనిసరి అన్నారు. కులగణన చేపట్టడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మూడు రాష్ట్రాలలో బీజేపీ విజయం సాధించినప్పటికీ ప్రధాని మోదీ కులగణనపై మాట్లాడడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కుమ్మరి క్రాంతికుమార్, పారేపల్లి మహేష్, ఉడతా శ్రీనివాసరావు, ఆలా శివాజీ, మండ్రు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మదమంచి రామస్వామి ట్రస్టు స్వాధీనం

ఈఓ జె.వి.నారాయణ

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని బస్టాండు ఆవరణలో ఉన్న మదమంచి రామస్వామి ట్రస్టు భవనాన్ని గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఈఓ జె.వి.నారాయణ తెలిపారు. స్థానిక చెన్నారెడ్డి ధర్మసత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ట్రస్టు భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, దాత ఆశయాలు కొనసాగించడం లేదంటూ కొద్ది నెలల కిందట ప్రత్తిపాడుకు చెందిన కొందరు దేవదాయశాఖ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారని, ఫిర్యాదుపై పలు దఫాలుగా ఏసీ, డీసీ, కమిషనర్ స్థాయిల్లో విచారణలు జరిగాయన్నారు. విచారణల అనంతరం దేవదాయశాఖ గెజిట్ పబ్లికేషన్ జారీ చేసి, సెక్షన్-43 రిజిస్టర్ అప్రూవల్ చేసి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించిందని ఈఓ తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రస్టుకు సంబంధించిన భవనానికి గురువారం సాయంత్రం తాళాలు వేసి ప్రకటన కూడా అంటించామన్నారు. అంతేకాకుండా ట్రస్ట్ కిందట ఉన్న నాలుగు దుకాణాల నుంచి అద్దెలు కూడా వసూలు చేసుకున్నామని ఈఓ తెలిపారు. ట్రస్టుకు ప్రత్తిపాడులో రెండు ఎకరాలకు పైగా కమర్షియల్ భూమి ఉందని, మరో ఆరు ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు కూడా వేర్వేరు గ్రామాల్లో ఉన్నాయని ఈవో వెల్లడించారు. ప్రత్తిపాడులో ఉన్న రెండెకరాల భూమిలో మరికొన్ని నిర్మాణాలు కూడా ఉన్నాయని, వాటిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గ్రామస్తుల సమక్షంలో పంచనామా జరిపి పదిరోజుల్లో పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకుంటామని ఈఓ తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూముల విలువ సుమారు రూ.5కోట్లు ఉంటుందని చెప్పారు. ట్రస్టు రికార్డులు అప్పగించాలని ట్రస్టు సభ్యులకు నోటీసులు జారీ చేశామన్నారు.

అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు

పొన్నూరు: కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందించే పచ్చి శనగపప్పు అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పొన్నూరు సీఎస్ డీటీ భువనేశ్వరి ఫిర్యాదు మేరకు పట్టణంలోని ఎస్‌పీబీ రోడ్డులోని ఓ గోడౌన్‌లో నిల్వ ఉంచిన ఏడున్నర టన్నుల పచ్చి శనగపప్పును సీజ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై ప్యాకెట్ల రూపంలో ఇచ్చిన శనగపప్పును విడిగా బస్తాల ద్వారా అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదు మేరకు ఈ దాడులు నిర్వహించి నాగసాయి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ రామచంద్రయ్య తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు, ఏఓ కె.రమణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

11న నగరంలో సైకిల్ ర్యాలీ

నెహ్రూనగర్: కాలుష్య రహిత నగరంగా గుంటూరును మార్చుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వి సర్వర్ ఎటీ చైర్మన్ సంపూర్ణ పేర్కొన్నారు. గురువారం ఇన్నర్‌రింగ్ రోడ్డులోని కార్యాలయంలో మాట్లాడుతూ కాలుష్య రహిత నగర సాధన దిశగా సాగిందేకు 11న నగరంలో సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు.